కథ

# ఆ!

పాలగుమ్మి రామకృష్ణారావు

తెలుగు గడ్డపై పుట్టి తెలుగు సాంప్రదాయాల్లో పెరిగిన మనిషి భవిష్యత్తులో వాటికి అందనంత దూరానికి వెళ్లినా వాటిని మనసునుండి చెరిపివెయ్యలేడనడానికి ఈ కథ ఒక చిన్న ఉదాహరణ. సిద్ధార్థ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో పట్టా పుచ్చుకుని ఉద్యోగం అనే రెక్కలు తగిలించు కుని ఆస్ట్రేలియా ఎగిరిపోయాడు. భారతదేశ కరెన్సీ లెక్కల ప్రకారం లక్ష రూపాయల జీతంతో మెల్‌బోర్న్‌లో వాలాడు. ఆ తరువాత రెండు నెలలకే తండ్రి సీతారామయ్య నుండి మెసేజ్‌లు రావడం మొదలు పెట్టాయి మంచి సంబంధాలు వస్తోన్నట్టు. 'నన్ను కాస్త కుదుట పడనివ్వండి నాన్నా' అన్నా వినిపించుకో వడం లేదు.



'నేనేం చెయ్యలేనురా అబ్బాయి. అవతల పెద్ద మనుషులు కావాలని మన గుమ్మం ఎక్కితే ఎలా పొమ్మన్ను? ఇవాళ నువ్వు గొప్ప ఉద్యోగస్తుడయ్యావని మా కళ్ళు నెత్తికెక్కాయనుకుంటారు. ఈ ఫొటోలు చూసి నచ్చితే ఊ అను, లేకుంటే లేదు' అంటూ వాటిని ఈ మెయిల్‌లో పెట్టసాగారు.

సిద్ధార్థ ఆఫీస్ పనిలో ఎంత బిజీగా ఉన్నా సాయంత్రం రూంకు వెళ్లే ముందయినా ఈ మెయిల్ తెరచి ఒకసారి అన్నీ పరిశీలించి తండ్రికి మెసేజ్ పంపడం అలవాటు చేసు కున్నాడు. అన్నిట్లో ఒకటే మాట 'నచ్చలేదు'.

'వచ్చిన వాళ్ళందరికి ఒకటే సమాధానం చెప్పడం చాలా కష్టంగా ఉందిరా' అని సీతారామయ్య గారంటే ఆయన ఉద్దేశ్యం వేరని, తను ఇక్కడ ఎవరితోనైనా ప్రేమలో పడతానని భయం అని సిద్ధార్థ అనుమానం. ఆ భయం పోగొట్టాలని తల్లికి, చెల్లాయికి కలిపి ఒక మెసేజ్ ప్రత్యేకంగా పంపించాడు. 'నేను ఇంతదూరం వచ్చినా నా మనసు మీ మధ్యనే ఉంది. నేనేం మారి పోలేదు,

మారను కూడా. మన సాంప్రదాయాలంటే నాకెంతో ఇష్టం. నాకు కావలసింది అచ్చంగా తెలుగింటమ్మాయి. చదువుకున్నది ఉద్యోగం చెయ్యడానికి ఇష్టపడిన అమ్మాయిని చూడండి'.

ఆ తరువాత ఒక రెండు నెలలు ఫొటోలు రావడం ఆగిపోయాయి. సిద్ధార్థ ఈ మధ్యకాలంలో సంసారానికి కావలసిన సామాన్లు అన్నీ ఏర్పాటు చేసుకోవడం మొదలు పెట్టాడు. పెళ్ళనే భావన తండ్రి రంగురంగుల ఫొటోలతో మెదడులోకి ఎక్కించాక సిద్ధార్థలో రంగుల కలలు ప్రారంభమయ్యాయి. విశ్వనాథ కిన్నెర సాని, నండూరి ఎంకి, బాపు నవ రసాల నాయికలు మనసును చుట్టేస్తున్నారు. సరదాగా సాహిత్యంతో పెంచుకున్న పరిచయం సమయానుకూలంగా ఇంత తియ్యని మధురానుభూతిలో మనసును తేలుస్తాయని ఎప్పుడూ అనుకోలేదు.

ఒక శుభోదయాన సీతారామయ్యగారి చ్చిన మెసేజ్ ఐదున్నర గంటల కాల మార్పిడిలో సిద్ధార్థ అందుకున్నాడు. ముందుగా సిద్ధార్థ చూసింది మెసేజ్‌తో వచ్చిన ఫొటో. సంక్రాంతి రంగ వల్లులు దిద్దుతున్న తెలుగింటి ముద్దుగుమ్మ, పరికిణీని ముగ్గులో పొరాడకుండా పైకి దోపుకుని, శీతాకాలపు చలిని మించిన శ్రమకు రుజువుగా నుదిటిపై స్వేద బిందువులు తటాకంలో ఎత్తుగా లేచిన తామరాకుపై నీటి తుంపరలుగా మెరుస్తోంటే ముగ్గంటిన అరచేతిని మడచి మణికట్టుతో తుడుచుకోవడానికి ప్రయత్నిస్తూ కెమేరాలోకి తన రూపం ముద్రపడుతోన్నదన్న గ్రహింపుగా రాబోతోన్న దరహాసాన్ని పెదవి దాటనీయకుండా మునిపంటితో నొక్కి పట్టినా, మందారాన్ని పరచుకుని ఉబ్బిన చెక్కిళ్ళు, విప్పారిన తామర కనుదోయి నుంచి ఆ చిరునవ్వు బయట పడింది.

సిద్ధార్థ ఆ ముఖారవిందానికి స్థాణువయ్యాడు. ఎంతసేపు చూసినా తనివి తీరని అందం అది. ఆ నుదురు అరుణోదయ కాంతిలో మెరిసే విశాలమైన ఎడారి. మధ్యన సింధూరం ఒక వయాసిస్. పొరాడే కురులు స్వేచ్ఛగా ప్రయాణిస్తోన్న విహంగాల బారులు. నాశిక ప్రబంధ కన్యల వర్ణనలకు కూడా అందని అతీతమైన ఒక వెండి మబ్బు. చుబుకం తేనె పట్టులోంచి జారిపడు



తోన్న మధు బిందువు.

సిద్ధార్థ ఎన్ని నిముషాలు ఆ ఫొటోను చూస్తూ ఉండిపోయాడో తనకే తెలియదు. కొలీగ్స్ పిలిచినపుడు ఈ లోకంలోకి వచ్చి మెసేజ్ చదివాడు. 'నాన్నా నీకు ఈ ఫొటో తప్పకుండా నచ్చుతుందని భావిస్తున్నాను. మా అందరికి నచ్చింది. పేరు లావణ్య. అమ్మాయి ఆస్ట్రేలియాలోనే సి.ఎ. చేసిందట. సిడ్నీలో ఉద్యోగం చేస్తోందట. ప్రస్తుతం సెలవు మీద ఇండియా వచ్చింది. వాళ్ళు పెళ్ళి ప్రయత్నాల్లో ఉన్నారు. నీ సమాధానం వెంటనే కావాలి. వాళ్ళ ప్రయత్నాలు వాళ్ళకుంటాయి కాదా'.

సిద్ధార్థకు కాదనటానికి కారణాలేం కనపడలేదు. జవాబు క్షణాల్లో కంప్యూటర్‌లోంచి గాల్లోకి వెళ్ళిపోయింది. 'నాకు ఒకె. వాళ్ళు ఒప్పుకుంటే ముహూర్తాలు చూడండి' అని. మెసేజ్ వెళ్ళిపోయాకా మనసు పూర్తిగా బిజీ అయిపోయింది. ఫొటోను డౌన్‌లోడ్ చేసుకుని పెద్ద సైజుకు మార్చి కాపీ తీసాడు. ఆలోచిస్తోంటే అదే ఫొటోలోంచి విచిత్రంగా వివిధ భంగిమల్లో కనపడుతోంది లావణ్య.

'లావణ్యా పెళ్ళి అయ్యాక నువ్వు మెల్‌బోర్న్ వస్తావా? లేక నేను సిడ్నీ రావాలా?' ఫొటోను రూంలో గోడకు అంటించి అనేకసార్లు ప్రశ్నించాడు. లావణ్య చిరునవ్వులో మార్పులేదు. 'సిడ్నీలో మాకు బ్రాంచి ఉందిలే. అవసరమైతే నేనే ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటా' సమాధానం కూడా అన్ని సార్లు చెప్పుకున్నాడు.

రెండు రోజులు, మూడు, నాలుగు, ఐదు రోజులు గడచిపోయాయి. ఇంటి దగ్గర నుండి జవాబు రాలేదు. సిద్ధార్థకు పిచ్చెక్కినంత పనయింది. ఆఫీస్ పని ముగించుకుని రూంకు వెళ్ళినపుడల్లా లావణ్య వెక్కిరిస్తూ ఫొటోలోంచి మెల్లగా అదృశ్యం అవుతోందా అనిపిస్తోంది. ఇంక ఉండబట్టలేక ఇంటికి మెసేజ్ పంపించాడు 'ఏమయింది?' అని

'నిన్ను చూడాలంటున్నారు. నువ్వు కూడా–'

'చూడ్డానికోసారి పెళ్ళికోసారి – అన్ని సార్లు సెలవులుండవు'.

'భయపడకు. అది సాంప్రదాయం. ఈ నెలలో ముహూర్తాలున్నాయట. ఎందుకయినా మంచిదని రెండు ముహూర్తాలకు కల్యాణ మండపం కూడా బుక్ చేసుకున్నారుట. నువ్వేమంటావు?'

'చెప్పాను కదా నాన్నా, ఏదో ముహూర్తం నిర్ణయించుకుని చెప్పండి. నాకు పదిహేను రోజుల సెలవుంటుంది, జర్నీతో కలిపి. గుర్తుంచుకోండి. అన్ని కార్యక్రమాలు అప్పుడే పూర్తి కావాలి. నాకు వెంటనే తెలియాలి. లీవ్ సాంక్షన్ చేయించుకుని ఎయిర్ టికెట్స్ కన్‌ఫర్మ్ చేసుకోవాలి' లావణ్య కనుమరుగవకుండా పట్టుకోవాలన్నా తపనతో జవాబిచ్చాడు.

మళ్ళీ నాలుగురోజులు బ్రేక్. సిద్ధార్థకు రుక్మిణీ కల్యాణం ఘట్టం గుర్తుకొచ్చింది. 'ఏలారాడు గోవిందుడు – తలచునో తలపడో – నా భాగ్యమెట్లుండెనో' ఇక్కడ పాత్రలు మారాయంతే. లావణ్య ఈ మెయిల్ అడ్రస్ తెలిసినా బాగుండేది. ఇంట్లో వాళ్ళని అడిగితే బాగుండదు. అడక్కుండానే ఇవ్వాలన్న జ్ఞానం వాళ్ళకుండాలి అనుకున్నాడు విచారంగా.

ఇంకా ఎక్కువ టెన్షన్ పడకుండానే జవాబొచ్చింది – ఇంటి దగ్గర్నించి కాదు – లావణ్య దగ్గర్నుంచి, ఊహించని పరిణామం సిద్ధార్థను ఆశ్చర్యంలో ముంచెత్తింది.

లావణ్యకు ఉన్న ధైర్యం తనకు లేనందుకు సిగ్గుపడ్డాడు. మెసేజ్ రెండు వాక్యాల్లో ముగించింది. 'మీ ఫొటో నాకూ నచ్చింది. అయినా ఒకసారి చూడాలనుకుంటున్నాను'.


సిద్ధార్థ జవాబును నాలుగు వాక్యాలు చేసాడు, 'ఫొటో చూసాకా సాంప్రదాయాలపై నీకున్న గౌరవం నాకు నచ్చింది. డైరెక్ట్‌గా పెళ్ళి పందిరిలో కలుసుకోవాలనుకున్నాను. కల్యాణ మండపం బుక్ చేసిన తేదీ చెబితే వస్తాను. ఇక్కడ ఈవినింగ్ సిక్స్‌కు నేను ఫ్రీగా ఉంటాను, ఛాటింగ్‌కు వీలుంటుందా?'

ఇక్కడి నుండి సీతారాయమ్మగారి మెసేజ్‌లకు ప్రాధాన్యత తగ్గింది. కమ్యూనికేషన్ అభివృద్ధి లావణ్య సిద్ధార్థలను క్షణాల దూరంలో నిలబెట్టింది. లావణ్య గొంతు విప్పితే సిద్ధార్థకు కోటి వీణలు వినపడుతున్నాయి. 'లావణ్యా నువ్వు మాట్లాడుతోంటే వివిధ భంగిమల్లో నా మనసులో ముద్ర పడుతున్నావు' అంటే అటు నుండి ఒక నవ్వుల సవ్వడి. దానికి మైమరచి భావుకత్వంతో 'కూచిపూడి భామ కథక్‌లో గిర్రున తిరిగితే ఎగిరే పరికిణీ నీ నవ్వుల అల' అంటాడు సిద్ధార్థ. అటు నిశ్శబ్దం.

'ఒక సౌఖ్యం లావణ్యా. నా కొలీగ్స్ ఎవ్వరికీ తెలుగు రాదు'.

'ఒక ఇబ్బంది. నేను తెలుగువాళ్ళ మధ్య కూర్చుని మాట్లాడుతున్నాను' సిద్ధార్థ కవిత్వానికి కళ్ళెం పడేది.

ఆ తరువాత కొద్ది రోజులకే సిద్ధార్థ కోరుకున్నట్లుగానే వివాహానికి ముహూర్తం నిర్ణయమై ఒక వారం రోజుల ముందుగా ఇండియా వచ్చాడు.




సాంప్రదాయాన్ని వదిలిపెట్టని పెద్దలు పెళ్ళి చూపుల వేడుక పెట్టారు.

సిద్ధార్థ గచ్చకాయ రంగు సూట్‌లో కారు దిగాడు. మనిషి పొడవుకు, రంగుకు డ్రెస్ చక్కగా అతికినట్లుంది అందర్ని ఆకర్షించాడు. మగ పెళ్ళివారి రాకతో ఆడపెళ్ళి వారి ఇల్లు కళకళలాడింది. వద్దన్నా ఫలహారాల మర్యాదలు ఆగలేదు. లావణ్య చెల్లెలు మరో నలుగురు బంధువుల పిల్లలతో ఎదురుగా కూర్చుని ఛలోక్తులు విసురుతో మాట్లాడుతోంది. మధ్యలో ఛాటింగ్ కవిత్వాన్ని బాణంలా సంధించిది. సిద్ధార్థ ఉలిక్కి పడ్డాడు. 'అమ్మో గడుగ్గాయి!' అని సర్దుకు కూర్చున్నాడు గాంభీర్యాన్ని తెచ్చుకుని.

పెద్దవాళ్ళ పరిచయాలు, పిల్లల పరాచికాలతో కొంచెం విసుగొచ్చింది సిద్ధార్థకు. అతని దృష్టి రాధాకృష్ణుల తెరవేసి బంతిపూల తోరణం కట్టిన గడప వైపే పదే పదే వెళుతోంది. ఫొటోలో చూసిన లావణ్య లావణ్యాన్ని ప్రథమంగా గడప దాటే పాదాన్నుంచి అగ్రభాగాన అధిరోహించిన కురుల వరకు మెట్టుమెట్టుగా నేత్రానందంతో మనోఫలకంపై ముద్రించుకోవాలనే తపన సిద్ధార్థలో పెరిగి, చుట్టూ ఉన్న తనవాళ్ళను మరచి, ఒక గొప్ప అనుభూతి హృదయాంతరాళలో జీవింతాంతం మిగిలిపోవాలన్నట్లుగా చూసాడు. కొంటె మరదలు 'రావమ్మా మహాలక్ష్మి రావమ్మా' రికార్డు ఆన్ చేసింది.

సరిగ్గా అప్పుడే ఆ ఇంటి మహాలక్ష్మి లావణ్య ఈ ఇంటికి వచ్చేదానిలా గుమ్మం బయటకు అడుగు పెట్టింది. ఆకుపచ్చని బెనారస్ పట్టు చీర బంగారు చెమ్కి బుట్టలతో లావణ్య అందాన్ని వదిలి ఉండలేనన్నట్టుగా చుట్టుకుంది. కాటుకతో విప్పారిన కళ్ళతో చెవుల జూకాలు జతకట్టాయి. సంపెంగి నాశికపై వజ్రపు తునక పుడకై నిలచి కాంతుల్ని చిమ్ముతోంది. సిద్ధార్థ అనుకున్నదొకటి, అయినదొకటి. అతని చూపులు మొత్తం ఆమె మొహం దగ్గరే ఆగిపోయాయి. లావణ్య పరిస్థితి కూడా అంతే.

కాసేపు బంధువుల మధ్య సరస సంభాషణలు అయ్యాక ఇద్దరికి మేడపైకి వెళ్ళి మాట్లాడుకునే స్వేచ్ఛనిచ్చారు.

పదిహేను రోజుల నుండి వెబ్‌లో ఛాటింగ్ చేస్తోన్నా ఇలా ప్రత్యక్షంగా ఎదురుపడి మాట్లాడడం ఇద్దరి మధ్య కొంత తెలియని సిగ్గు చోటు చేసుకుంది. ఏదో ఒకటి మాట్లాడాలన్నట్టుగా 'నీ డ్రెస్ టేస్ట్ చాలా బాగుంది' అన్నాడు సిద్ధార్థ మొదటగా.

'మీ సూట్ కూడా నాకు నచ్చింది'.

సిద్ధార్థ గట్టిగా నవ్వేసాడు. 'ఛాటింగ్ వదిలేసి మరేదయినా మాట్లాడుకుందాం. సిడ్నీ ఎప్పుడొస్తున్నావు?'

'పదిహేను రోజుల్లో బయలుదేరతాను. మీరు అడిగింది కంపెనీ డైరెక్టర్స్‌తో మాట్లాడాను. ఇప్పట్లో

ట్రాన్స్‌ఫర్‌కు అవకాశం లేదన్నారు.'

'ఓ.కే. లావణ్యా... డోన్ట్ వర్రీ. మాకు సిడ్నీలో బ్రాంచ్ ఉంది. ఆల్‌రడీ మా మేనేజిమెంట్‌తో మాట్లాడాను. వాళ్ళు ఒప్పుకున్నారు. బి హాపీ' ఇద్దరిలో కొత్తదనం పోయి మామూలు స్థితి కొచ్చారు. తరువాత అరవై నిముషాలు అర నిముషంలా గడచిపోయాయి. వియ్యంకుళ్ళు కూడా ఆ అరవై నిముషాలు పెళ్ళిలో ఇచ్చిపుచ్చుకోవడాలు, ఆనవాయితీలు మాట్లాడుతూ గడియారాన్ని చూసి 'అబ్బా ఇంత టైమయిందా!' అంటూ లేచారు.

కిందనుంచి పిలుపు రాగానే సిద్ధార్థ లావణ్య చేయి ఆప్యాయంగా నొక్కి భారంగా మెట్లు దిగాడు. పెళ్ళికి ముందు వారం రోజులు గడవటం చాలా కష్టమని షేక్స్‌పియర్ అన్న మాటలు గుర్తు కొచ్చి సిద్ధార్థ మరింత డీలా పడ్డాడు. కాని సెల్ ఫోన్లు షేక్స్‌ఫియర్ మాటల్ని అబద్ధం చేసి చూస్తాం డగానే దంపతుల్ని చేసి వదిలి పెట్టాయి.

పెళ్ళయిన తరువాత రెండు రోజులు అత్తవారింటికి పుట్టింటి మధ్య పూజలు, వ్రతాలతో దంపతులను తిప్పి మూడవ రోజు శోభనం ఏర్పాటు చేసారు. ఆ రోజు మరదలు కాలక్షేపం కోసం లావణ్యా ఫొటో ఆల్బం ఇచ్చింది.

రాత్రి తలుపులు మూత పడ్డాక లావణ్య వడిలో తల పెట్టుకుని ఆల్బంలో ఒక్కొక్క ఫోల్డరును తెరుస్తో సిద్ధార్థ ఉత్సాహంగా చూస్తోంటే లావణ్య అవి ఏ సందర్భంలో తీసినవో వివరిస్తోంది. కొన్ని సిద్ధార్థే ఊహించి చెపుతున్నాడు.

'ఇది దీపావళికి తీసింది కదూ?'

'కాకరపువ్వొత్తుల్నీ, చిచ్చుబుడ్లను చూసి చెప్పడం గొప్పేం కాదు'.

'పసుపు రంగు లంగావోణి ఆ వెలుతురులో నీ మొహంపై ఎంత అందమైన ఛాయనిచ్చాయో చూసావా! ఐ లైకిట్'.

'తరువాత ఫొటో చూడండి. ఇప్పుడు చెప్పాలి ఇది ఎప్పుడు తీసిందో'.

సిద్ధార్థకు సందర్భం తట్టలేదు. ఆకుపచ్చ రంగులో డిజైన్ చేసిన సిల్క్ చీర పైట కొంగు మెరూన్ రంగు చారలు వాటి మధ్య బారులు తీరిన నెమళ్ళు – బెంగాలి పద్ధతిలో పైటను ముందుకు వేసుకుంది. గుమ్మాలకు మామిడి తోరణాలు వేలాడుతున్నాయి. 'మీ ఇంట్లో ఏదైనా ఫంక్షన్ జరిగుండొచ్చు – అదే నువ్వు బహుశా పెద్ద మనిషయినప్పుడు' అన్నాడు చివరిగా.

లావణ్య సిద్ధార్థ తలపై చిన్నగా మొట్టింది. సిద్ధార్థ ఒక్క క్షణం విస్తుపోయినా లావణ్య చనువుకు ముగ్ధుడై రెండు చేతులతో ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

'ఆ ఫొటో దుర్గాష్టమి నాడు తీసుకున్నది. బెంగాలీలకేనా మనకు ముఖ్యమైన పండుగ కాదా అని అలా డ్రస్ చేసుకున్నాను' సిద్ధార్థ ఒక్కొక్క ఫోల్డరు తిప్పుతోంటే లావణ్యా ఒక్కో విశేషం చెప్పింది. మధ్యమధ్యలో సిద్ధార్థ హాస్యపు జల్లులు. అసుకవితా ధారణలు, లావణ్య చిరుకోపాలు, నగవులు ఇద్దర్నీ మరింత దగ్గర చేసాయి.

***

సిద్ధార్థ మెల్‌బోర్న్ తిరిగొచ్చిన పదిహేను రోజులకే లావణ్య కూడా సిడ్నీ చేరింది. ఈ లోగానే సిద్ధార్థ తన ట్రాన్స్‌ఫర్ ఆర్డరు సిద్ధం చేసుకున్నాడు. రెండు నెలల క్రితం కొన్న ఇంటి సామాన్లు ఫ్రిడ్జ్, బెడ్, ఎ.సి., గ్రైండరు మొదలైన ఖరీదైన వస్తువులు సిడ్నీకి ఎలా తీసుకువెళ్ళాలో అర్థం కాలేదు. స్నేహితుల్ని అడిగితే కొన్న ఖరీదుకు నాలుగు రెట్లు రవాణా ఖర్చు అవుతుందన్నారు. ఇలా ట్రాన్స్‌ఫర్‌లు వచ్చినప్పుడు ఎక్కడి వస్తువులు అక్కడే అయినకాడికి అమ్ముకుని వెళ్ళడం ఉత్తమం అని సలహా ఇచ్చారు.

మొన్న పెళ్ళికి అమ్మ అటక మీద నుండి సామాన్లు దింపిస్తోంటే వాటిని చూసి ఆశ్చర్యపోయాడు సిద్ధార్థ. వాటి రూపాలు కూడా వింతగా ఉన్నాయి. పేరులైతే అసలు తెలీవు. అమ్మే అన్నీ ఒకొక్కటి దుమ్ము దులుపుతూ చెప్పింది. 'దీన్ని రావణా బిందె అంటారు. మా అమ్మమ్మ వాళ్ళ మావగారు కోటిపల్లి తీర్థంలో రెండణాలు పెట్టి కొని తెచ్చారుట. దీనిమీద పేరు కూడా వేయించారు చూడు – చి.శే. అని, ఆయన పేరు శేషాచలంరా, మీ మావయ్య పేరూ అదేగా. ఇదేమో గంగాళా. పులుసులు కాచుకోవడానికి చక్కగా ఉంటుంది. ఇవి గోకర్ణాలురా. ఎందుకేవిటి నీ మొహం. వడ్డన చేసుకునేందుకు'.

సిడ్నీ ఎయిర్‌పోర్ట్‌కు లావణ్య వచ్చింది సిద్ధార్థను రిసీవ్ చేసుకునేందుకు. లావణ్యను చూడగానే సిద్ధార్థ ఒక్క క్షణం స్థాణువయ్యాడు. ఫేంటు, షర్టులో ఉంది. పైన కోటు కూడా వేసుకుంది. డైరెక్ట్‌గా ఆఫీస్ నుండే వస్తున్నానని చెప్పింది. బయటకు రాగానే టాక్సీ పిలుస్తానంటే వద్దని ఆఫీసు కారు తెచ్చానని చెప్పింది. డ్రైవింగ్ సీట్లో లావణ్య కూర్చోగానే మరొకసారి ఊపిరాగినట్లయింది. లావణ్యను తను చాలా తక్కువగా ఒక కోణం నుండే అంచనా వేసినట్లు గ్రహించాడు.

రెండు నెలల క్రితం ఎంతో ఇష్టంతో కొన్న వస్తువులను తిరిగి అమ్మెయ్యాలంటే బాధనిపించినా తప్పలేదు. లావణ్యకు చేరవవుతున్నానన్న సంతోషంలో సెంటి మెంటును జయించి ఒక్క సూట్ కేస్‌తో ఫ్లైట్ ఎక్కాడు.

సిడ్నీ ఎయిర్‌పోర్ట్‌కు లావణ్య వచ్చింది సిద్ధార్థను రిసీవ్ చేసుకునేందుకు. లావణ్యను చూడగానే సిద్ధార్థ ఒక్క క్షణం స్థాణువయ్యాడు. ఫేంటు, షర్టులో ఉంది. పైన కోటు కూడా వేసుకుంది. డైరెక్ట్‌గా ఆఫీస్ నుండే వస్తున్నానని చెప్పింది.

బయటకు రాగానే టాక్సీ పిలుస్తానంటే వద్దని ఆఫీసు కారు తెచ్చానని చెప్పింది. డ్రైవింగ్ సీట్లో లావణ్య కూర్చోగానే మరొకసారి ఊపిరాగినట్లయింది. లావణ్యను తను చాలా తక్కువగా ఒక కోణం నుండే అంచనా వేసినట్లు గ్రహించాడు. కారులో ఉన్నంతంసేపు తన ఇంటి సామాన్లు అమ్మడంలో పడ్డ కష్టాల్ని చెప్పాడు. 'ప్రస్తుతానికి మనకు ఉండడానికి ఇబ్బందులేం లేవు లే' అంది లావణ్య.

లావణ్య అపార్ట్‌మెంటుకు వెళ్ళగానే సిద్ధార్థ అన్ని గదుల్నీ కలయచూసాడు. ఇల్లంతా ఎంతో కళాత్మకంగా అమర్చింది.

'వెరీ నైస్' అన్నాడు సిద్ధార్థ భార్య నడుంపై చేయి వేసి దగ్గరకు తీసుకుంటూ.

'నీ కోసం నాలుగు రోజుల నుండి శ్రమ పడి ఈ రూపం తీసుకొచ్చాను'.

'నీ' పిలుపుతో హృదయానికి మరింత దగ్గరయిన ఆమెను అలాగే పొదవి పట్టుకుని ముందుకు నడచిన సిద్ధార్థ వార్డ్‌రోబ్ తలుపు తెరిచాడు. పరికిణీలు, పట్టు చీరలు ఏవీ లేవక్కడ. అన్నీ ఫేంట్లు, షర్టులు, కొన్ని పంజాబి డ్రస్సులు. సిద్ధార్థ ఆమె కళ్ళలోకి ప్రశ్నార్థకంగా చూసాడు. లావణ్య ఇట్టే గ్రహించింది. 'పెళ్ళికి కొన్న వాటిల్లో రెండు చీరలు మాత్రం తెచ్చాను. నిజానికి నాకు వాటిని సరిగ్గా కట్టుకోవడం రాదు. ఇంటి దగ్గరయితే అమ్మో, చెల్లాయో హెల్ప్ చేస్తారు'.

'ఫొటోల్లో అన్నీ చీరల్లో!'

'అవన్నీ ఫాన్సీగా వేసుకున్నవే. క్షమించు, ఆ విషయం చెప్పలేదనుకుంటాను. కాలేజీలో పోటీలక్కూడ రకరకాల డ్రస్సులు మేకప్‌లు బ్యూటీ పార్లర్లలో చేయించుకునే వాళ్ళం'.

సిద్ధార్థకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఇంతగా బాధ పడతాడని లావణ్య ఊహించలేదు. కొన్ని క్షణాల మౌనం తరువాత అంది – 'నీ కవితా ధోరణి చూసి అది హాబీ అనుకున్నాను. కాని ఇంత అనుభూతితో ఉంటావనుకోలేదు. ఈసారి ఇండియా వెళ్ళినప్పుడు మరిన్ని చీరలు తెచ్చుకుంటాను సిద్ధార్థ. ఇంతకుముందు ఎయిర్‌పోర్ట్ నుంచి వస్తూ ఒక మాటన్నావు. అత్తయ్యగారు మూడు తరాల నుంచి దాచిన పాత సామాన్లు చూసాకా, కొని రెండు నెలలు కూడా కాకుండా కొత్త వస్తువులు అమ్ముకునే పరిస్థితికి బాధ పడ్డా నా కోసం వచ్చానని చెప్పావు. నాకు చాలా సంతోషం కలిగింది నన్ను అర్థం చేసుకోగల భర్త దొరికినందుకు.

'తెలుగుతనం నా కళ్ళ ముందే ఉన్న సంగతి మరచి ఏదో అడిగాను. సారీ లావణ్యా' అంటూ సిద్ధార్థ చందమామను తన రెండు చేతుల్లోకి తీసుకున్నాడు ఆప్యాయంగా.

*

**చిరునామా:**
**పాలగుమ్మి రామకృష్ణారావు,**
**ప్లాట్ నం. 101, గౌతమ్‌నగర్ కాలనీ,**
**టి.ఆర్.టి. టౌన్‌షిప్ ఫేజ్ –2,**
**మీర్‌పేట (మం) సరూరునగర్ మండలం,**
**హైదరాబాదు 500 079,**
**ఫోన్ నెం. 24092894**